# పరధ్యాన ప్రహసనాలు

పరధ్యానం అంటే, పరిసరాలని మర్చిపోయి వేరే ధ్యాసలో పడిపోవటం. కొన్ని గంటలు వులుకూ పలుకూ లేకుండా వుండిపోవటం. దీన్నే ఆధ్యాత్మిక వాదులు యోగ నిద్రని , సృష్టిని విచారణని , అదే డాక్టర్లు మానసిక ఆనారోగ్యానికి మొదటి దశని, మనాక్కావలసిన వ్యక్తికి ఈ సుగుణం వుంటే మేధావితనం అని, గిట్టని వాడయితే మెదడుకి సంబంధించిన జబ్బని అంటూ వుంటారు.

అసలు పరధ్యానానికి కారణాలేమిటి అని తరచి చూస్తే తేలేది – పదిమందిలో వున్నప్పుడు అక్కడున్న వ్యక్తులు. జరుగుతున్న కార్యక్రమం పైన ఉత్సాహం లేనపుడు , ఏ దూలం వంకో చూస్తూ వేరే ఆలోచనల్లో పడిపోవటం. పరధ్యానానికి భగవ ధ్యానానికి పెద్ద తేడా లేదు. కాకపోతే భక్తుడి ఆలోచనలు కేవలం భగవంతుడి చుట్టూ తిరుగుతుంటే, పరధ్యానా ప్రబుద్దులు ఆలోచన్లు మాత్రం దేని చుట్టయినా తిరగొచ్చు.

స్కూల్లో చదువుకునే రోజుల్లో మాకో సోషల్ మాస్టారుగారుండేవాడరు. ఆయన పేరు కాంతారావో, కూర్మారావో సరిగ్గా గుర్తులేదు గాని వారిని భార్య వొదిలేసి వెళ్ళిపోయింది. ఎప్పుడూ దీర్ఘలోచనల్లో వుండేవారు. పాఠం చెప్తూ పరధ్యానంలోకి జారిపోయేవారు. ఏ కుర్రాడన్నా లేచి ‘ సార్ తళ్ళి కోట యుద్దానికి కారకులెవర్సార్ ’ అనడిగితే, పరధ్యానంలో వున్న మాష్టరు ,‘ప్చ్ .....నేనే కారణం. తొందరపడ్డా ’ ననేవారు. క్లాసంతా ఘోల్లుమంటేగాని ఈ లోకంలో కొచ్చేవారు కాదు.

ఈ పెళ్ళయిన వాళ్ళకి ముఖ్యంగా మగవాళ్ళకి పరధ్యానం ఆరోగ్యప్రదం కాదు. ఫ్లాష్ బాక్‌లున్నవాళ్ళు మరింత జాగ్రత్తగా వుండాలి. మహాలక్ష్మీ లాంటి భార్య భోజనానికి పిలిస్తే ‘ ఆకల్లేదు అనసూయా ’ అన్నారో ఇహనంతే ! మీకొంప మీరు ముంచకున్నట్లే . మీ గొయ్యి మీరు తవ్వుకున్నట్లే ! అంచేత ఇంట్లో కాస్సేపు ఆలోచన్లనీ శరీరాన్ని ఒకచోట కట్టివేసుకోవటం ఉత్తమ పురుష లోణం.

ఒక ఇల్లాలు ఓ సందర్భంలో పతిదేవుడ్ని రెక్కపుచ్చుకుని డాక్టరుగారి దగ్గరకి తీసుకెళ్ళి ‘ వుండి వుండి ., మాట్లాడుతూ మాట్లాడుతూనే పరధ్యానంలోకి పడిపోతుంటారు. పైగా ఏవి టేమిటో మాట్లాడుతుంటారు ’ అందిట. దానికి డాక్టరుగారు

ఆమెకి ధైర్యం ధోరణిలో ‘ ఏం కంగారులేదు. పరధ్యానానికి మంచి మెడిసినుంది ’ అంటుంటే ! ఆ ఇల్లాలు మధ్యలోనే అడ్డు తగిలి ‘ మీరు ఇవ్వాల్సింది పరధ్యానానిక్కాదు. ఆ వాగేది స్పష్టంగా అర్ధమయ్యేలా చెప్పటానికి ’ అనందిట.

ప్రయాణాల్లో పరధ్యానం అస్సలు పనికిరాదు. మీరు తేరుకునే సరికి సూట్‌కేసు పోవటమో. దిగాల్సిన స్టేషను దాటి ముందుకు ప్రయాణించటమో జరగవచ్చు. అంచేత దేనికయినా సమయం సందర్భం వుండాలి. హెయిర్ కట్టింగ్ సెలూన్ కెళ్ళి తలని అప్పగించి పరధ్యానంలో పడిపపోతే, ఇంటికొచ్చిన మిమ్మల్ని చూసి ఇల్లాలు ‘ వారు లేరండి… బయటికెళ్ళారు. ఏవన్నా చెప్పమంటారా ’ అంటూ తలుపు చాటునుంచి అనే ప్రమాదం వుంది. మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోవటానికి పుట్టు మచ్చులో , వేలి ముద్రలో ప్రదర్శించాల్సి వుంటుంది. ఇలాంటి పరధ్యాన భర్తతో వేగలేని ఒక భార్య ఒకసారి ఓ కుర్ర హిప్నాటిస్టుని పట్టుకొచ్చి వార్ని హిప్నటైజ్ చేసి అసలు పరధ్యానానికి క్కారణం కనుక్కోమందిట. ఆ హిప్నాటిస్టు పడక్కుర్చీలో పడుకున్న పతిదేవుడి పక్కన చేరి ‘ మీ కనురెప్పలు బరువెక్కుతున్నాయ్. ఎంతో హాయిగా వుంది. శరీరం తేలకయిపోతోంది. కళ్ళు మూతలు పడుతున్నాయంటూ అరగంట అవస్థ పడ్డాట్ట. పరధ్యానంలో వున్న ఆ పతి దేవుడు చెక్కు చెదరని ఏకాగ్రతలో అలాగే వున్నాట్టగాని, కుర్ర హిప్నాటిస్టు మాత్రం గచ్చు నేలపైని పడి నిద్దరోయాట్ట. అంచేత పరధ్యానం భగవధ్యానం అంత పవర్‌ఫుల్. ఎంతో జాగ్రత్తగా హేండిలు చెయ్యాలి మరి…….

------- అయ్యిపోయింది -------